క్లుప్తంగా

రూ.20 లక్షలతో సీసీ రోడ్లు



ప్రభుత్వ కార్యాలయాల వద్ద చేపట్టిన సీసీ రోడ్డు

కోట: మండల కేంద్రమైన కోటలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ నిధులు రూ.20 లక్షలు వెచ్చించి రోడ్డు పనులు చేపడుతున్నట్లు పీఆర్ ఏఈ కిరణ్ తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతోపాటు పోలీస్ స్టేషన్, కోర్టు ప్రాంగణం, ఫైర్ స్టేషన్ వరకు రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో దోమల నిర్మూలనకు చర్యలు



కేసవరంలో వీధుల్లో చెత్తను తొలగిస్తున్న వైద్యసిబ్బంది

కోట: దోమల వల్ల వచ్చే వ్యాధులు, కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చిట్టేడు పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు తెలిపారు. ఆయన శుక్రవారం వైద్య, సచివాలయ సిబ్బందితో కలిసి కేసవరంలో దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా, వీధుల్లో చెత్త నిల్వలు వేయకుండా చూడాలని స్థానికులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల వల్ల మలేరియా, విషజ్వరాలు ప్రబలుతాయని డాక్టర్ నాగరాజు తెలిపారు. ప్రతి ఒక్కరూ రాత్రిళ్లు దోమతెరలు వాడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పి.వెంకటస్వామి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో ఉన్న 132 సబ్ స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ క్రమంలో వెంకటగిరి టౌన్, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

అభివృద్ధికి బాటలు వేస్తాం



మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు రూరల్ : గూడూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం గూడూరులోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలో ఉన్న దేవదాయ, ప్రభుత్వ భూములను పేదలకు దక్కేలా చూస్తామన్నారు. గూడూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా పనిచేయాలని సూచించారు. పేదలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు పనులు చేయాలన్నారు.

పత్రాలు లేని లారీలు పట్టివేత

చిల్లకూరు : సరైన ధ్రువీకరణ పత్రాలు లేని నాలుగు లారీలను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సైదాపురం మండలం నుంచి చెన్నై వైపు వెలుతున్న రెండు లారీలను ఆపారు. పత్రాలు చూపించమని చెప్పడంతో డ్రైవర్లు చూపించలేకపోయారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను రెవెన్యూ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ నాలుగు లారీలను మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు: మహాత్మాజోతీరావ్‌పూలే ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలుర పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల15వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో https:// mjpbcwres.apcfss.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. పాఠశాల పరిధిలో 59 సీట్లు ఖాళీ ఉన్నాయి. 6వ తరగతిలో 25, ఏడో తరగతిలో 12, ఎనిమిదో తరగతిలో 14, తొమ్మిదో తరగతిలో 8 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు
- వాహన రిజిస్ట్రేషన్‌కు హెల్మెట్ లింకు
- నూతన చట్టం అమలుకు అధికారుల చర్యలు





రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన దృశ్యాలు (ఫైల్)

సైదాపురం: నేటి యువత త్వరగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో బైక్‌లలో అతివేగంతో వెళుతున్నారు. దీనికితోడు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల బారిన పడి కుటుంబ సభ్యులకు తీరని దుఃఖం కలిగిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేదు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా వాహనాల రిజిస్ట్రేషన్‌కు హెల్మెట్‌ను లింకు చేశాయి. కొత్త వాహనం కొనుగోలు చేసిన సమయంలోనే హెల్మెట్ తీసుకోవాలనే షరతు విధించాయి. హెల్మెట్ ఉంటేనే వాహనం రిజిస్ట్రేషన్ చేస్తామని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే వాహన యజమాని కొత్త హెల్మెట్‌ను, దాని బిల్లును సమర్పిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించారు. మోటారు వెహికల్ చట్టం-138(ఎఫ్) ప్రకారం వాహనాలు విక్రయించే డీలర్లు విధిగా హెల్మెట్‌ను అందుబాటులో ఉంచాలి. వాహన చోదకులు ఆసక్తి చూపనందున ఎవరూ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. డీలర్లు హెల్మెట్‌లు తప్పనిసరి చేస్తున్నా వాహన చోదకులు మాత్రం ఇంట్లోనే హెల్మెట్‌లు పెట్టి వాహనాలను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు, కలువాయి, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల్లో ఇప్పటికే పోలీసు అధికారులు హెల్మెట్ వాడకంపై క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు.

129 సెక్షన్ ప్రకారం

మోటారు వాహన చట్టంలోని 129 సెక్షన్ ప్రకారం ద్విచక్రవాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి. ఈ నిబంధనలు ఎప్పటి నుంచో అమల్లో ఉన్నా...ఆచరణకు నోచుకోలేదు. ఈ విషయంపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీ చేయడంతో దేశమంతా హెల్మెట్ వినియోగంపై దృష్టి మళ్లింది. రోజు రోజుకు పెరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని నిబంధనలు అమలు చేస్తున్నారు పోలీసులు. దీని కోసం ప్రత్యేక తనిఖీలను కూడా చేపడుతున్నారు. దీని కోసం అధిక జరిమానాలను కూడా విధిస్తున్నారు. కనీసం ఆ భయంతోనైనా హెల్మెట్ అలవాటు చేసుకుంటారని అధికారులు భావిస్తున్నారు.

విస్తృత ప్రచారం అవసరం

- హెల్మెట్ల వాడకంపై కరపత్రాలు పంచడంతో పాటు ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా ఆయా సంస్థలు కఠిన చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలలు, కళాశాలల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించాలి.
- హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహన చోదకులకు నోటీసులు జారీ చేయాలి..
- పట్టుబడితే తొలి సారి కౌన్సిలింగ్ చేసి వదిలి పెట్టాలి. పునరావృతమైతే భారీ జరిమానా విధించేలా పోలీసులు చొరవ చూపాలి.

నాణ్యతలేని హెల్మెట్‌తో ప్రయోజనం శూన్యం

పోలీసు కేసులను నుంచి తప్పించుకునేందుకు నాణ్యతలేని హెల్మెట్‌లను కొనుకోలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని అధికారులు చెబుతున్నారు. ఫుట్ పాత్‌లపై లభించే హెల్మెట్‌ల వల్ల ధరలు తగ్గుతాయి కానీ, ప్రాణ రక్షణకు గ్యారెంటీ ఉండదని పేర్కొన్నారు. చిన్న చిన్న ప్రమాదాల్లో వాహన చోదకులు కిందపడితే హెల్మెట్ పగిలి వాటి వలన కూడా గాయాలపాలయిన సందర్భాలు అనేకం ఉన్నాయని అధికారులు గుర్తు చేస్తున్నారు.

హెల్మెట్ వినియోగం తప్పని సరి



వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలి. లేనిపక్షంలో మొదటిసారి అపరాధ రుసుం విధిస్తాం. రెండో సారి, మూడో సారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. కేసులు కూడా నమోదు చేస్తాం. మనిషికి ప్రాణం కన్నా ఏదీ ముఖ్యం కాదు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి తప్పించుకోవాలి.

– ఎస్‌ఐ విజయ్‌కుమార్

ప్రారంభానికి నోచుకోని వాటర్ ప్లాంట్లు



కొత్తపల్లిలో ప్రారంభానికి నోచుకోని వాటర్ ప్లాంట్

దొరవారిసత్రం : మండలంలోని ఎనిమిది పంచాయతీలకు 2019-20లో కేంద్ర ప్రభుత్వం పీఎంఏజీవై నిధుల కింద రూరల్ వాటర్ సప్లయ్ అండ్ శానిటేషన్ పథకం ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్లు మంజూరు చేసింది. ఒక్కోదానికి రూ.10 లక్షలు కేటాయించింది. ఇందులో కొత్తపల్లి, సింగనాలత్తూరు, కొత్తపల్లి, నేలపట్టు పంచాయతీ కేంద్రాల్లో భవనం, మినరల్ ప్లాంట్, బోరు పాయింట్ వంటి పనులు చేపట్టారు. మిగిలిన పంచాయతీ కేంద్రాల్లో పనులే మొదలుకాలేదు. మీజూరులోగత ఏడాదే ప్లాంట్ ప్రారంభమై తాగు నీటి సరఫరా అందేవిధంగా అధికారులు చర్యలు చేపట్టారు. మిగిలిన కొత్తపల్లి, నేలపట్టు, సింగనాలత్తూరు ప్రాంతాల్లో ప్లాంట్లు నిర్మించగా కేంద్రం ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో రెండేళ్ల పనులు ఆగిపోయాయి. కొత్తపల్లి గ్రామ పరిధిలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ పూర్తి స్థాయిలో పనులు చేసినప్పటికీ బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ ప్లాంటును పంచాయతీకి అప్పగించలేదు. అధికారులు స్పందించి బిల్లులు చెల్లింపులు విషయంలో జాప్యం చెయ్యకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చెరువు కట్ట గండిని పూడ్చాలని వినతి



పాళెంపాడులోని అన్నారెడ్డిగుంట చెరువుకు పడిన గండి

దొరవారిసత్రం : గత ఏడాది తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఏకొల్లు పంచాయతీ పరిధిలోని పాళెంపాడు గ్రామంలో ఉన్న అన్నారెడ్డిగుంట చెరువు కట్టకు గండి పడింది. నీరు మొత్తం వెళ్లిపోయింది. కట్ట మరమ్మతుల కోసం సంబంధిత ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాలేదు. ఈ చెరువు కింద సుమారు 40 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది.

వర్షాలు మొదలుకాకముందే గండిని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈగండికి మరమ్మతులు చేపట్టకపోతే వర్షాలు కురిసినా ప్రయోజనం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు.

కండలేరులో 6.563 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.563 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ షఫీ

డక్కిలి : మండలంలోని వెలికల్లు గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను శుక్రవారం టెక్నికల్ అసిస్టెంట్ షఫీ తనిఖీ చేశారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పనులు కల్పించాలని తెలిపారు. కనీస వేతనం రూ.300 గిట్టుబాటు అయ్యేలా నాలుగు గంటలు పాటు పని చేయాలని కూలీలకు సూచించారు. పనులు పారదర్శకంగా నిర్వహించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కూలీల హాజరును ఎప్పటికప్పుడు మస్టర్ ఆన్‌లైన్‌లో నమోదు చేసి కూలీలకు నగదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

గూడూరు రూరల్ : ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించి శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఎవరైనా గొడవలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గూడూరు సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు.

తొలకరితో ఖరీఫ్ సాగుపై చిగురించిన ఆశలు



రబీ సాగు కోసం వేసిన వరి నారుమడులు





డక్కిలి సమీపంలో సాగులో ఉన్న పచ్చిరొట్ట పైరు, నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలం

డక్కిలి: రెండు మూడు రోజులుగా మండలంలో తొలకరి జల్లులు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎక్కువ మంది రైతులు రబీలో పంటలు సాగుచేయలేదు. పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము, పిల్లి పెసర పంటలను సాగు చేసుకుని నేలను సారవంతం చేసుకుందామని భావించారు. నీటి లభ్యత లేకపోవడంతో వేచి చేస్తూ ఉన్నారు. ముందస్తుగా రుతు పవనాల రావడంతో తొలకరి జల్లులు కురుస్తున్నాయి. దీంతో పచ్చిరొట్ట సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొంతమంది రైతులు బోరు బావులు కింద పచ్చిరొట్ట పంట సాగు చేశారు. సాధారణంగా జిల్లాలో అక్టోబర్ నుంచి ఖరీఫ్ పంట సాగు చేస్తారు. వర్షాభావం దృష్ట్యా కండలేరు జలాశయంలో తగినంత నీరు లేకపోవడంతో ఖరీఫ్‌పై ఆశలు వదులుకున్నారు. జిల్లాను రుతుపవనాలు తాకి వర్షాలు కురవడం, మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షాలు బాగా కురిస్తే కాలువలు, చెరువులు నిండి ఖరీఫ్ పంటను సునాయాసంగా పూర్తి చేసుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు సామరస్యంగా ఉండాలి

- వివాదాలు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు
- నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి హెచ్చరిక



144 సెక్షన్ అమలులో ఉందని ఆటోలో ప్రచారం చేస్తున్న పోలీసులు



సీఐ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్ : ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజలు గొడవలకు పాల్పడకుండా సామరస్యంగా ఉండాలని నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంతో పాటు పట్టణంలో ఓట్ల లెక్కింపు సమయంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా సహకరించిన అన్ని పార్టీల నాయకులు, ప్రజలకు తెలిపారు. ప్రస్తుతం కూడా 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడా గుంపులుగా ఉండడం, బహిరంగ వేడుకలు చేసుకోవడం, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, కేక్ కటింగ్‌లు చేయడం వంటివి నిషేధమన్నారు. ఎన్నికల ఓటమి, గెలుపులపై ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా ఇతరులను కించపరిచేలా పోస్టులు పెట్టరాదన్నారు. నిబంధనలు వ్యతిరేకిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకరణలో వళ్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి, ప్రత్యేక అలంకరణలో దుర్గామల్లేశ్వరి దేవి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని వళ్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి, స్వర్ణముఖి నదీ తీరం వద్ద ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు.

నేడు కల్యాణ వెంకన్నకు ప్రత్యేక పూజలు

పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయం వద్ద ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేస్తామన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు



అమ్మవారి ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు పర్యవేక్షణలో లెక్కించారు. రూ.30,17,383 వచ్చినట్లు తెలిపారు. అమ్మవారికి భక్తులు అందించే కానుకల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామని ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, చేవూరు శ్రీనివాసులు, దువ్వూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు





గాయపడిన వాణి, అన్నాకి



వాగులో బోల్తా పడిన కారు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణ పరిధిలోని చంద్రబాబు కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట పట్టణానికి చెందిన న్యాయవాది పసల చెంగయ్య శుక్రవారం భార్య వాణి, అత్త అన్నాకి, కుమారుడు లీలాకృష్ణ, కుమార్తె కామాక్షి కల్యాణితో కలిసి కారులో నెల్లూరు వెళ్లారు. తిరిగి నాయుడుపేట బయలుదేరారు. నాయుడుపేట పట్టణ సమీపంలోని చంద్రబాబు కాలనీ జాతీయ రహదారి కూడలి వద్ద కారు మలుపు తిరుగుతుండగా సూళ్లూరుపేట వైపు నుంచి నెల్లూరు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో న్యాయవాది కుటుంబ సభ్యులు ఉన్న కారు వాగులో బోల్తా పడింది. కారులో ఉన్న న్యాయవాది భార్య వాణి, అత్త అన్నాకి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడు, కుమార్తె, చెంగయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారు స్థానిక ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సమాచానం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు పొంగళ్లు



రేణుకా యల్లమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగలో శుక్రవారం శీతలాంబ దేవి, రేణుకా యల్లమ్మ ఆలయాల్లో పొంగళ్లు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలతో పూజలు నిర్వహించి, అంబళ్లు పోశారు. మహిళలు ఆలయాల వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.